సాక్షి
బాపట్ల

శనివారం । 22 । ఏప్రిల్ । 2023



త్రికోటేశ్వరా...


నరసరావుపేట రూరల్: త్రికోటేశ్వర స్వామిని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖా మంత్రి కె.వి.ఉషా శ్రీచరణ్ శుక్రవారం దర్శించుకున్నారు. మంత్రికి అధికారులు స్వాగతం పలికారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.5,800, మోడల్ ధర రూ.4500 వరకు పలికింది.

జీరో కరోనా



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటీ నమోదు కాలేదు. అలాగే ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.

న్యూస్‌రీల్

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

ప్రత్తిపాడు: రైతు భరోసా పథకానికి అర్హత ఉన్న రైతులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు ఏడీఏ జి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మరోసారి రైతుభరోసా పోర్టల్‌ను ఓపెన్ చేయడం జరిగిందని, ఇప్పటివరకు రైతుభరోసా పథకం ద్వారా లబ్ధిపొందని కర్షకులు, అర్హత ఉన్న వారు ఎవ్వరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయకీలాద్రిపై తిరునక్షత్ర ఉత్సవాలు



తాడేపల్లిరూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి పర్వతంపై శుక్రవారం నుంచి మంగళవారం వరకు తిరునక్షత్ర ఉత్సవములు నిర్వహిస్తున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో శుక్రవారం ఉదయం రామానుజుల వారికి తిరుమంజన సేవ నిర్వహించామన్నారు. అలాగే అలంకరణ, మల్లెపూలతో సహస్రనామార్చన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం తీర్థప్రసాద గోష్ఠితో కార్యక్రమం ముసిగిందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జీయర్ పాఠశాల వేద విద్యార్థులు, విజయకీలాద్రి అర్చకులు పాల్గొన్నారు.

25న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఈనెల 25న హైదరాబాద్‌కు చెందిన ఇన్ఫోసోర్స్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిషన్ ఆపరేటర్స్, టెక్నీషియన్స్ పోస్టులకు 18 ఏళ్ల నిండి టెన్త్, ఐటీఐ, డిప్లొమా (ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్, మెకానికల్) అర్హతలు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో అర్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు వేతనం ఉంటుందని, అనుభవం గల అభ్యర్థులకు ఎక్కువ వేతనం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ప్రభావతిని 70137 17319 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

తల్లి ఒడికి పసికందు

ప్రత్తిపాడు: మద్యం మత్తులో మందుకు డబ్బులు లేక ఏడాదిన్నర పసికందును తల్లికి తెలియకుండా అమ్మేసిన తండ్రి ఉదంతమిది. పోలీసుల చొరవతో 48 గంటలు గడవక ముందే పసికందు మళ్లీ తల్లి ఒడి చేరడంతో కథ సుఖాంతమైంది. కోయవారిపాలెంలో నివాసం ఉంటున్న వసంతరావు జాలరి. అతను చేపల కుంటలు చూసేందుకు రెండురోజుల క్రితం అద్దంకి వెళ్లాడు. పూర్తిగా మద్యం మత్తులో ఉన్న వసంతరావు అక్కడ స్నేహితుడు వీరాంజనేయులుకు తన ఏడాదిన్నర బిడ్డ ఏసురాజును అమ్మేశాడు. ఈ విషయం భార్య కొండమ్మకు చెప్పలేదు. ఈ నేపథ్యంలో బిడ్డ కనిపించడం లేదని వసంతరావు భార్య కొండమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ రవీంద్రబాబు 48 గంటలు కూడా గడవకముందే కేసును ఛేదించారు. వసంతరావు స్నేహితుడిని వీరాంజనేయులును తమదైన శైలిలో విచారణ చేయడంతో అతను పసికందును తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు పసికందును తల్లి చెంతకు చేర్చారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 523.70 అడుగుల వద్ద ఉంది. ఇది 156.1096 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,088, ఎడమకాలువకు నీటిని నిలుపుదల చేశారు. ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 6,888 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 6,888 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.50 అడుగుల వద్ద ఉంది. ఇది 31.3083 టీఎంసీలకు సమానం.

వైఎస్సార్ బీమా..పేదలకు ధీమా

- రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ అర్హులే
- బాపట్ల జిల్లాలో 3,83,222 మంది పాలసీదారులు
- 2021-2022లో 768 కుటుంబాలకు లబ్ధి
- 2022-2023లో 402 కుటుంబాలకు లబ్ధి

బాపట్లఅర్బన్: ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. వారికి నేనున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుకొచ్చారు. పెద్దకు ఏదైనా జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడకూడదనే సంకల్పంతో వైఎస్సార్ బీమా పథకాన్ని తీసుకొచ్చారు. తెల్ల రేషన్ కార్డు ఉంటే చాలు ఆ కుటుంబం రూపాయి చెల్లించాల్సిన పని లేదు. మొత్తం ప్రభుత్వమే భరిస్తోంది.

బాపట్ల జిల్లాలో 3,83,222 కుటుంబాలకు వైఎస్సార్ బీమా సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. ప్రమాదవశాత్తూ మరణిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు ఇస్తుంది. ప్రమాదంలో రెండు కాళ్లు కానీ రెండు చేతులు కానీ పోగొట్టుకున్నట్లయితే రూ.ఐదు లక్షలు, ఒక కాలు కానీ ఒక చెయ్యి కానీ పోయినట్లయితే రూ.2.50 లక్షలు ఇస్తుంది. సహజంగా మరణిస్తే రూ.లక్ష బీమా కింద పరిహారం లభిస్తుంది. 18 నుంచి 70 సంవత్సరాలలోపు వారికి ప్రమాద బీమా, 18 నుంచి 50 సంవత్సరాల లోపు వారికి సహజ మరణ బీమా వర్తిస్తుంది. ఆధార్ కార్డులోని పుట్టిన తేదీనీ ప్రామాణికంగా తీసుకొని పరిష్కరిస్తారు. సహజ మరణానికి పరిహారం పూర్తిగా ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రమాదవశాత్తూ జరిగే మరణాలకు పరిహారం చెల్లింపునకు ప్రభుత్వం ఓరియంటల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఒక్క రూపాయి కూడా ప్రీమియం లేకుండా వైఎస్సార్ బీమా సదుపాయం కల్పించడం విశేషం. సహజ మరణం పొందిన, ప్రమాదవశాత్తూ మరణించిన వెంటనే సంబంధిత సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌కు సమాచారం ఇస్తే 24 గంటలలోపు మట్టి ఖర్చులు నిమిత్తం రూ.10వేలు చెల్లిస్తారు. వైఎస్సార్ బీమా కింద క్లెయిమ్‌ల పరిష్కారానికి ప్రత్యేక షెడ్యూల్ ఉంది. దీని ప్రకారం సహజ మరణం క్లెయిం 24 రోజులు, ప్రమాద మరణం క్లెయిం 65 రోజుల్లోనూ పరిష్కరిస్తున్నారు. సచివాలయం స్థాయిలో జరిగే డాక్యుమెంటేషన్‌ను అనుసరించి పరిష్కారమవుతాయి. సహజ ప్రమాద మరణాలకు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ డాక్యుమెంటేషన్ పూర్తిచేసి కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ వైకేపీలోని వైఎస్సార్ బీమా కాల్ సెంటర్‌కు పంపాల్సి ఉంది. కాల్ సెంటర్‌లోను బీమా డీఆర్డీఏ వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ అన్ని సక్రమంగా ఉంటే ఆమోదించి పరిహారం చెల్లింపు కోసం జీఎస్ ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్‌కు పంపుతారు. 2021 -2022కి బాపట్ల జిల్లాలో 768 కుటుంబాలకు మొత్తం రూ.తొమ్మిది కోట్ల 32 లక్షలు లబ్ధి పొందారు. 2022- 2023కు సంబంధించి 402 కుటుంబాలకు రూ.నాలుగు కోట్ల 86 లక్షలు లబ్ధి పొందారు.

- కర్లపాలెంకు సుబ్బయ్యకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. భార్యాభర్తలు కూలి పనులు చేసుకుని వారి చదివిస్తున్నారు. ఓ రోజున కూలి పనులకు వెళ్లి వస్తున్న సుబ్బయ్య ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. దిక్కు తోచని పరిస్థితి.

- పిట్టలవానిపాలెం గ్రామానికి వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కార్మికుడు. ఆయనకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఓ రోజు భవన నిర్మాణ పనిలో ఉండగా ప్రమాదవశాత్తూ కింద పడి కాలు కోల్పోయాడు. ఆదాయాన్ని ఆర్జించే పెద్ద మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబం గడవడమే కష్టంగా మారింది.



జగనన్న రుణం తీర్చుకోలేనిది



నా భర్త బాపట్ల పాత బస్టాండ్‌లో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. నాకు కుమార్తె, కొడుకు ఉండటంతో పోషణ కష్టంగా మారింది. ఆ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం కింద రూ.ఐదు లక్షలు పరిహారం అందించింది. జగనన్న రుణం తీర్చుకోలేనిది.

–అనుపోజు మంగతాయారు, బాపట్ల

అర్హులైన ప్రతి ఒక్కరికి బీమా పథకం అమలు



రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ బీమా పథకం అమలు చేస్తున్నాం. సచివాలయంలో ఎంత త్వరగా డాక్యుమెంటేషన్ పూర్తిచేసి పంపితే అంత త్వరగా వైఎస్సార్ బీమా పథకం కింద కుటుంబానికి సహజ మరణానికి రూ.లక్ష, ప్రమాద మరణానికి రూ.ఐదు లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం బీమా సదుపాయం కల్పిస్తుంది.

– బొంతా అర్జునరావు, ప్రాజెక్ట్ డైరెక్టర్ డీఆర్‌డీఏ, బాపట్ల జిల్లా

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- ఎస్పీ వకుల్ జిందాల్
- పర్చూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు
- ఒక్కో సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం



పర్చూరు పోలీస్‌స్టేషన్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమైనదని ఎస్పీ వకుల్‌జిందాల్ అన్నారు. పర్చూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ఎస్పీ వకుల్‌జిందాల్ శుక్రవారం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణతోపాటు పరిశోధనలో సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. దాతల సహకారంతో పర్చూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రధాన కూడలి ప్రాంతాలతోపాటు, సరిహద్దు ప్రాంతాల్లో నూతనంగా 32 సీసీ కెమెరాలను ఏర్పాటుచేయటం హర్షనీయమన్నారు. ప్రతి కెమెరాను పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేశామన్నారు. ప్రస్తుత సమాజంలో నేరాలు జరుగుతున్న తీరు, నేరస్తులు నేరం చేసే విధానాలు అనేక విధాలుగా ఉంటున్నాయన్నారు. వాటిని ఛేదించడం పోలీస్‌శాఖకు సవాలుగా మారుతుందన్నారు. నేరం జరిగిన తర్వాత కూడా నిందితుల కదలికలను, నిందితులు ఎవరనేది తెలుసుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో నేరస్తులు నేరాలు చేయడానికి భయపడతారని, మహిళలకు, వ్యాపారస్తులకు భద్రత పెరుగుతుందన్నారు. ఒక్కో సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, వాటితో 24 గంటలు నిఘా ఉంటుందని దుకాణాల వద్ద, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం సీసీ కెమెరాలు అందజేసిన దాతలను ఎస్పీ సత్కరించారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, మార్టూరు సీఐ షేక్ ఫిరోజ్, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాసరావు, పర్చూరు ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్, మార్టూరు ఎస్ఐ కమలాకర్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

వేసవి తాపాన్ని తగ్గించేందుకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేయటం అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. పర్చూరు బొమ్మల సెంటర్‌లో రోటరీక్లబ్ సహకారంతో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎస్పీ వకుల్‌జిందాల్ శుక్రవారం ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రయాణికులు, వాహనదారులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. సమాజానికి మంచి పనులు చేయడానికి ముందుకు వచ్చే సంస్థలు, వ్యక్తులకు పోలీస్‌శాఖ తరపున తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

28న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 28న భేటీ కానున్నాయి. ఈ మేరకు జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు శుక్రవారం షెడ్యూల్ విడుదల చేశారు. స్థాయీ సంఘ సమావేశాలకు హాజరు కానున్న అధికారులు ఆయా శాఖల వారీగా ప్రగతి వివరాలతో పాటు గత సమావేశాల్లో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలతో కూడిన సమగ్ర వివరాలతో హాజరు కావాల్సిందిగా సమాచారాన్ని పంపించారు. మొత్తం ఏడు స్థాయీ సంఘాలకు గాను 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. అదే విధంగా 3వ స్థాయీ సంఘానికి సంబంధించిన సమావేశం వ్యవసాయంపై జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన జరగనుంది. స్త్రీ–శిశు సంక్షేమంపై తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి అధ్యక్షతన 5వ స్థాయీ సంఘం, సాంఘిక సంక్షేమంపై జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన 6వ స్థాయీ సంఘ సమావేశం జరగనుంది.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు

- వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు
- మెడికల్ కళాశాలల పనులు వేగవంతం
- సిబ్బంది కొరత తొలగించేందుకు చర్యలు
- 2025-26నుంచి అడ్మిషన్లు



బాపట్లలో మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రధానకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు

బాపట్ల :ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చెప్పారు. బాపట్ల జిల్లాకు తొలిసారిగా వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ ప్రధానకార్యదర్శి శుక్రవారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. బాపట్లలో నిర్మిస్తున్న వైద్య కళాశాల భవన పనులను ఆయన పరిశీలించారు. బాపట్లలోని ఏరియా వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ విభాగం, ప్రసూతి కాన్పుల విభాగం, లాబొరేటరి విభాగం, బ్లడ్ బ్యాంకు పనితీరు, ఔషధాల విభాగం, నిల్వ కేంద్రాలను తనిఖీ చేశారు. వైద్యశాలలోని వైద్య పరికరాలు, యంత్ర పరికరాలను పరిశీలించారు. కాన్పుల విభాగంలో ఉన్న బాలింతలతో ఆయన మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సాధారణ వార్డులో వైద్యం పొందుతున్న రోగులతోనూ ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ సేవలపై ఆరాతీశారు. వైద్యశాల పరిసరాలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ వైద్యం

పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. బాపట్ల జిల్లా కేంద్రంలో మంజూరైన వైద్య కళాశాలకు స్థలం సమస్య రావడంతో నిర్మాణ పనులలో ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం శరవేగంగా కళాశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఆ భవనంలో వైద్య సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలలను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. మొదటి దశగా 2025-26 సంవత్సరంలో ఐదు కళాశాలలను ప్రారంభిస్తామని, అందులో బాపట్ల జిల్లా ఒకటని వివరించారు. అడ్మిషన్లు మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండవ దశలో మూడు వైద్య కళాశాలలను ప్రారంభించడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. బాపట్లలో జిల్లా వైద్యశాల లేనందున కొంత సమస్య ఏర్పడుతున్న మాట వాస్తవమేన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రానున్న మార్చిలో వైద్య కళాశాలలోనే జిల్లా వైద్యశాలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నర్సుల కొరతపై ప్రత్యేక చర్యలు

ప్రభుత్వ వైద్యశాలల్లో నర్సుల సమస్య పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కృష్ణబాబు చెప్పారు. ఏ వైద్యశాలలో ఖాళీ ఉద్యోగాలు ఉన్నాయో వాటిని గుర్తించి త్వరలో భర్తీ చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ వైద్యశాలల్లో నర్సుల కొరత ఉందన్నారు. ఏఎన్ఎంలుగా పనిచేస్తూ జీఎన్ఎం పూర్తి చేసుకున్న వారికి, ప్రస్తుతం శిక్షణలో ఉన్న సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించి ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. 108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేస్తామన్నారు. గ్రామాలలో పరిస్థితులు, వైద్యులు, సిబ్బంది పనితీరు, ప్రజలలో ఏ మేరకు అవగాహన ఉందో తెలుసుకోవడానికి పరిశీలన చేస్తున్నామని వివరించారు. వైద్యరంగంలో సమస్యలన్నీ త్వరలో పరిష్కారం కానున్నాయని ఆయన తెలిపారు. ఆయన వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ, తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు

పర్చూరు(చినగంజాం): ప్రజలందరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు అన్నారు. శుక్రవారం పర్చూరు మండలం చెరుకూరు గ్రామానికి చేరుకొని ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడి వైద్య సేవలు తెలుసుకున్నారు. సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న బలమైన ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న పాఠశాలకు వెళ్లి విద్యార్థులు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాల గురించి వారితో కొద్దిసేపు ముచ్చటించారు.

అదిగో చేప..ఇదిగో ఆరోగ్యం

- 276 యూనిట్లు మంజూరు
- 80 యూనిట్లలో అవుట్ లేట్ నిర్మాణాలు
- అందుబాటులో నాణ్యమైన చేపలు
- ఊరూరా ఫిష్ ఆంధ్ర రిటైల్ షాపులు



వేటపాలెంలో నిర్మాణంలో ఉన్న ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ యూనిట్

వేటపాలెం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. అంతే కాదు ప్రజల ఆహార భద్రతపై కూడా మరింత శ్రద్ధ పెట్టి రోగనిరోధక శక్తి పెంపొందించాలనేది ముఖ్య ఉద్దేశం. అందుకు అనుగుణంగా మత్స్య సంపదను ప్రజల్లోకి తీసుకెళ్లే బృహత్తర కార్యక్రమం మొదలు పెట్టింది. బాపట్ల జిల్లాలో సముద్రతీరం ఎక్కువగా ఉంది. 'ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర' నినాదంతో చెరువుల చేపలు, సముద్రపు చేపలు, కాలవలో చేపలు వినియోగదారులకు అందుబాటులోకి తెస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడనుంది. దీనితో పాటు వినియోగదారులకు నాణ్యమైన చేపలు సరసమైన ధరలకు లభిస్తాయి.

276 రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు చర్యలు

సముద్రతీరం ఎక్కువగా ఉండటంతో మత్స్య సంపద విరివిగా లభిస్తుంది. దీంతోపాటు, మార్టూరు, అద్దంకి, ఇంకొల్లు, చినగంజాం వంటి ప్రాంతాల్లో చేపల చెరువులు అధికంగా ఉన్నాయి. మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్వై)ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. మత్స్యశాఖ పథకాలకు జిల్లాలో వివిధ బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తుంది. జిల్లాలో ఇప్పటికే 80 రిటైల్ ఫిష్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు యూనిట్లు మంజూరు చేశారు. ఈ యూనిట్లు నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇంకా ఉత్సాహవంతులైన వారు యూనిట్‌లు ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి యూనిట్‌లు మంజూరు చేయడానికి మత్స్యశాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో జిల్లాలో చేపల వినియోగం గణనీయంగా పెరిగింది. ఇప్పటికే కారంచేడు పరిధిలో చీరాల, పర్చూరు, వేటపాలెం, మార్టూరు, చిన్నగంజాం పరిధిలో 12 యూనిట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

యూనిట్స్ సబ్సిడీ వివరాలు...

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద 40 శాతం సబ్సిడీ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 16 శాతం, దీంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా మరికొంత సబ్సిడీతో కలిపి మొత్తం 70 శాతం సబ్సిడీ యూనిట్‌కి అందుతుంది. యూనిట్ ఖరీదు రూ.3 లక్షలుగా ఉంది. ఎస్సీలు, మహిళలకు 70 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట..

ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. దీనితో పాటు వినియోగదారులకు మత్స్యసంపద అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఫిష్ ఆంధ్ర యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటికే 80 యూనిట్‌ల అవుట్‌లెట్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మేలో వీటిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం. ఉత్సాహవంతులు ముందుకు వస్తే యూనిట్లు మంజూరు చేయడానికి మత్స్యశాఖ సిద్ధంగా ఉంది. – పీ సురేష్, మత్స్యశాఖ జేడీ, బాపట్ల

ఐలవరం విద్యార్థుల ప్రతిభ

- ఐదేళ్లుగా కొనసాగుతున్న వినూత్న కార్యక్రమాలు
- థాయ్‌లాండ్‌లోని ఉన్నతాధికారులతో భేటీ



వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న ఐలవరం హైస్కూల్ విద్యార్థులు, తిలకిస్తున్న అధికారులు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదేళ్లుగా విద్యార్థుల సృజనాత్మకతకు, భావ ప్రకటనా ప్రతిభకు ఆంగ్ల భాషా ప్రావీణ్యానికి పదును పెట్టేలా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అవలంబించని విధంగా వివిధ దేశాల్లో వర్చువల్‌గా, ఉత్తర ప్రత్యుత్తర (పెన్‌పాల్) విధానం ద్వారా తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఇప్పటికే వర్చువల్‌గా 90 దేశాలు, పెన్‌పాల్ విధానం ద్వారా 19 దేశాల విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శుక్రవారం థాయ్‌లాండ్‌లోని ఉన్నతాధికారులతో వర్చువల్‌గా హాజరయ్యారు. ఐలవరం విద్యార్థులు ఏపీలోని నూతన విద్యా సంస్కరణలు, తమ హైస్కూల్‌లో అవలంభిస్తున్న వినూత్న కార్యక్రమాలను వివరించారు. భవిష్యత్తులో తమ దేశంలోనూ ఈ విద్యావిధానాన్ని అవలంభించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వారు వివరించారు. తమ దేశ విద్యార్థులతో త్వరలో భేటీ కానున్నట్లు వారు ప్రకటించారు. ఐలవరం విద్యార్థులు రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ వారిని ఆకర్షించడమే కాక ఆసక్తిని కలిగించింది. ఈ కార్యక్రమాన్ని ఐలవరం హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణ ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా ప్రధానోపాధ్యాయులు కాటూరి లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

సీజన్‌కు ముందే మరమ్మతులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: వ్యవసాయ సీజన్‌కు ముందుగా సాగునీటి కాలువల మరమ్మతు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో పంట కాలువల అభివృద్ధి పనులు చేయడానికి రూ.23 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. త్వరలో కాలువల అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని అన్నారు. రైతులు పండించిన శనగలు, కందులు కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో రైతులు పండించిన పంటలకు ఆర్బీకేల ద్వారా మద్దతు ధర కల్పిస్తామని చెప్పారు. జిల్లాలో రైతులు వేసిన పంటలకు ఇ క్రాప్ నమోదు చేయాలన్నారు. నమోదు చేసిన ఈ–క్రాప్ నమోదును వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టాలన్నారు. డీఆర్వో లక్ష్మీశివ జ్యోతి, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్, ఉద్యాన శాఖ ఏడీ జెన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్యాగానికి ప్రతీక రంజాన్

శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నాగార్జున



భట్టిప్రోలు: త్యాగం, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. జిల్లాలోని ముస్లిం సోదరులకు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) శుభాకాంక్షలు తెలిపారు. అల్లాహ్ దయతో ముస్లిం కుటుంబసభ్యులందరూ సుఖ, సంతోషాలు, ఆర్థికాభివృద్ధితో తుల తూగాలని.... నిండు మనసారా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి పండుగలు రానున్న రోజుల్లో మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మసీదులు ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు

– ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: మసీదులు, ఈద్గాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుచేయాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. రంజాన్ ఉపవాసాలు ముగించుకొని శనివారం ఈద్ ఉల్ ఫితర్ జరుపుకునేందుకు సిద్ధమవుతున్న ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లాలోని పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ముస్లింలు రంజాన్ పండుగ జరుపుకోవడానికి పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలన్నారు. సోషల్ మీడియాపై నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో రంజాన్ పండుగ జరుపుకొనే విధంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

వలకు చిక్కిన మొసలి

మాచవరం: పిల్లుట్ల గ్రామ శివారులోని సింగరాయపాలెం తండాకు వెళ్లే మార్గంలోని వాగులో వలకు మొసలి చిక్కింది. గ్రామానికి చెందిన కొందరు యువకులు శుక్రవారం చేపల కోసం వల వేయగా మొసలి చిక్కింది. స్థానిక అధికారులు అందించిన సమాచారంతో అటవీశాఖ అధికారులు గ్రామానికి వచ్చి మొసలిని బంధించి, నాగార్జునసాగర్‌లోని సంరక్షణా కేంద్రానికి తరలించారు.

ఉపాధి హామీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న పీడీ శంకరనాయక్

–డ్వామా జిల్లా పీడీ శంకరనాయక్

చినగంజాం: ఉపాధి హామీలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, పని కల్పించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ వై శంకరనాయక్ సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో అయన ఇన్‌చార్జి ఎంపీడీవో కే స్వరూపరాణి, ఏపీవో ఇన్‌చార్జి రేణుక, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. చినగంజాంలో మూడు ప్రాంతాల్లో గతంలో వేసిన రోడ్లను పరిశీలించి దానికి సంబంధించి రోడ్లు ఉన్నాయని, వాటిని వేసిన ఆనవాళ్లు కన్పించక పోవడంపై ఆయన ఆరాతీశారు. స్థానికంగా పలువురు కూలీలతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన కార్యాలయంలో సమావేశమై సిబ్బందితో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ అన్‌సీజన్‌లో వ్యవసాయ పనులు లేని కారణంగా జిల్లాలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, ఈ ఏడాది కూలీలకు 75 లక్షల పనిదినాలు కల్పించాలనేది లక్ష్యం పెట్టుకున్నామని చెప్పారు. గతేడాది 74.84 లక్ష పనిదినాలు చేశామని దానిని అధిగమించాలని లక్ష్యం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ వరకు ప్రతి ఒక్కరికి 100 రోజులు పని దినాలు కల్పించాలని సిబ్బందికి సూచించామన్నారు. జిల్లాలో రోజుకు లక్షమంది పని కల్పించాలని, ప్రస్తుతం 60 వేల మంది పనిచేస్తున్నారని చెప్పారు. వారంలో లక్ష్యాన్ని చేరతామని ఈ మేరకు సిబ్బందికి ఆదేశాలిచ్చామని అన్నారు. ఇప్పటి వరకు కూలీలకు రూ.257లు కూలీ ఉండేదని మే 1 నుంచి రోజువారీ కూలీ రూ.272 ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎండాకాలం వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని కూలీలు ఉదయం 6 గంటల కల్లా పనులకు వచ్చి 11 గంటల్లోపు పనులు నిర్వహించాలని సూచించారు. ఉద్యాన శాఖకు సంబంధించిన మామిడి, జీడి మామిడి వంటి మొక్కల పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

గుంటూరులో సీఏటీని ఏర్పాటు చేయండి

– కేంద్ర న్యాయ శాఖ మంత్రికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కేంద్రప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పదోన్నతులు, పెన్షన్ సమస్యలు, బకాయిల వివాదాల పరిష్కారానికి రాజ్యాంగబద్ధంగా ఉన్న సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (సీఏటీ)ని ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఏర్పాటు చేయాలని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజును నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీలో ఇప్పటికీ క్యాట్ బెంచ్ లేదని, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న బెంచ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోని.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సేవలు అందిస్తోందని, ఏపీలోనే 50,000 మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, క్యాట్ బెంచ్ లేకపోవడం వల్ల వీరు ఇబ్బంది పడుతున్నారని, వారి కష్టాలను దృష్టిలో ఉంచుకుని, గుంటూరు జిల్లాలో శాశ్వత క్యాట్ బెంచ్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఎంపీ కేంద్రమంత్రికి విన్నవించారు.

ప్రజారోగ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం

వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు



పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, చిత్రంలో ఎమ్మెల్యే కరణం

వేటపాలెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజా ఆరోగ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దా తిరుమల కృష్ణబాబు పేర్కొన్నారు. వేటపాలెంలో రూ.1.77 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాన్ని ఆయన, ఎమ్మెల్యే కరణం బలరాం శుక్రవారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగన్ ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడానికి నాడు-నేడు కార్యక్రమంలో మొదటి విడతలో 150 పీహెచ్‌సీలు, రెండో విడతలో 88 పీహెచ్‌సీ భవనాలు కొత్తవి నిర్మించడానికి నిధులు మంజూరు చేశారన్నారు. మొత్తం 238 భవనాలను మంజూరు చేశారని తెలిపారు. ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉండాలని సీఎం ఆదేశించారని చెప్పారు. పేద ప్రజలకు అతి చేరువలోనే వైద్యం అందించాలని పీహెచ్‌సీ కాని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రతి గ్రామ సచివాలయానికి అనుగుణంగా ఏర్పాటు చేశారని వివరించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందజేయడానికి 105 రకాల మందులు, 14 డయాగ్నస్టిక్స్, 67 రకాల వస్తువులు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామస్థాయిలోనే ఆరోగ్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకొని ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేయడం గొప్ప విషయమన్నారు. ప్రతి విలేజ్ సచివాలయానికి ప్రతి నెలా రెండుసార్లు డాక్టర్ వారి సిబ్బందితో వెళ్లి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. గ్రామ సచివాలయ విలేజ్ క్లినిక్‌లను బలోపేతం చేయడం ద్వారా 80 శాతం వ్యాధులు గ్రామ స్థాయిలోనే నయం చేసుకోచ్చని సూచించారు. గడిచిన రెండేళ్లలో 48,600 మంది వైద్య సిబ్బందిని నూతనంగా నియమించామన్నారు. గ్రామ సచివాలయ పరిధిలోని విలేజ్ క్లినిక్‌లో బీఎస్సీ నర్సింగ్ చదివిన గ్రాడ్యుయేట్‌ని రూ.40 వేల జీతంతో ఏర్పాటు చేశామని, వీరితో పాటు ఒక ఏఎన్ఎం, ఆశను నియమించామని పేర్కొన్నారు.

సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించాలని సూచించారు. వైద్యసిబ్బంది సమన్వయంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం పందిళ్లపల్లి పీహెచ్‌సీ భవన నిర్మాణానికి అడ్డంకులను తొలగించి నూతన భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ విజయశ్రీ, ఆర్‌డీఓ సరోజిని, డీఈ నరసింహులు, ఎంపీడీవో శర్మ, వైద్యాధికారి ప్రభాకర్‌రావు, డాక్టర్ బాలరాజు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో నిందితులు
- పట్టుబడిన గంజాయి విలువ రూ.4.50 లక్షలు



మాట్లాడుతున్న బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు

మార్టూరు: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తుల ఆట కట్టించారు పోలీసులు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాపట్ల డీఎస్పీ ఏ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లా బలకార గ్రామానికి చెందిన మొయిద్దీన్ కుట్టి, అదే జిల్లా తెన్నాల పుతువరంబ గ్రామానికి చెందిన సుధీష్, కరణ్ స్నేహితులు. వీరిద్దరు మరో ఇద్దరు వ్యక్తులు నాగరాజు, శరత్‌కుమార్‌లు కలిసి రెండు కార్లలో గంజాయిని అన్నవరం, రాజమండ్రి ప్రాంతాల నుంచి కేరళ రాష్ట్రం తరలించటానికి గురువారం ఉదయం బయలుదేరారు. స్థానిక రాజుపాలెం కూడలి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ఎస్కే టీ ఫిరోజ్ బృందాన్ని చూసి దుండగులు డేగరమూడి వైపు పరారయ్యారు. పోలీసులు వాహనాన్ని వెంబడించి మొయిద్దీన్ కుట్టి, సుధీష్, కోరనాథ్‌లను అదుపులోనికి తీసుకొని వారి నుంచి రెండు కిలోల బరువు గల 20 ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. రెండో వాహనం కోసం వెతికిన అధికారులకు డేగరమూడి వాగు సమీపంలో నిలిపి ఉంచిన కారును పరిశీలించగా అందులో 100 కిలోలకు సమానమైన 2 కిలోల ప్యాకెట్‌లు 50 లభించాయి. నిందితులు నాగరాజు, శరత్‌కుమార్‌లు పారిపోగా అధికారులు కారును మొత్తం 140 కిలోల గంజాయిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. చాకచక్యంగా గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్న సీఐ ఫిరోజ్, ఎస్సై కమలాకర్, ఏఎస్సై సైదా సిబ్బంది కోటేశ్వరరావు, ప్రసాద్, నరేంద్ర, రాజేష్‌లకు ఎస్పీ వకుల్ జిందాల్ ఎనిమిది అవార్డులు ప్రకటించినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ, ఎస్సై ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో స్టేడియం లిఫ్టర్లకు జాతీయ పతకాలు



పతకాలు సాధించిన లిఫ్టర్లను సత్కరిస్తున్న చీఫ్ కోచ్ వెంకటేశ్వరరావు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 15న హైదరాబాద్‌లో జరిగిన సౌత్‌జోన్ మాస్టర్స్ జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక బీఆర్ స్టేడియంలోని హెల్త్‌క్లబ్ జిమ్‌కు చెందిన లిఫ్టర్లు బంగారు పతకాలు సాధించారని డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వి.దుర్గా ప్రసాద్, కె.నాగరాజు, బీవీఎల్ నరసింహారావు, ఎం.శ్రీనివాస్ కుమార్ మొత్తం నాలుగు బంగారు పతకాలు గెలుపొందారని చెప్పారు. ఈ సందర్భంగా కోచ్ కమురుద్దీన్, పతకాలు సాధించిన లిఫ్టర్లను సత్కరించామని వెల్లడించారు.

సేద్యం అభివృద్ధికి సమష్టి కృషి

గుంటూరు రూరల్: వ్యవసాయ రంగం అభివృద్ధికి శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, మార్కెటింగ్ అడ్వైజర్ బి.బ్రహ్మానందరెడ్డి చెప్పారు. నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణ జిల్లాల (కృష్ణ మండలం) వ్యవసాయ పరిశోధన, విస్తరణ, సలహా మండలి సమావేశం శుక్రవారంతో ముగిసింది. బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాత్రను అభినందించారు. క్షేత్రస్థాయిలో రైతులవద్దే విత్తనోత్పత్తికి ప్రోత్సాహం అందించాలని అధికారులకు సూచించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలలో దేశ వ్యాప్తంగా మంచి ఆదాయాన్ని అందించే గృహ విజ్ఞాన, ఉద్యాన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించి వారికి అధిక ఆదాయం లభించేలా కృషి చేయాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం, ఏరువాక కేంద్రాల కో-ఆర్డినేటర్లు వారి జిల్లాలలో ఉన్న పంటలలో చేపట్టిన ప్రగతిని, వివరించారు. వరి, అపరాలు, పత్తి, చెరకు, చిరుధాన్యాలు, వేరుశనగ, యాంత్రీకరణ, విస్తరణ అంశాలపై అధికారులతో చర్చించారు.

పారదర్శకంగా మత్స్యకార భరోసా లబ్ధిదారుల ఎంపిక

చీరాల టౌన్: మత్స్యకార భరోసా ఆర్థిక సాయం అర్హులైన ప్రతి మత్స్యకారుడికి అందించేందుకు పటిష్టంగా చర్యలు తీసుకుంటున్నామని మత్స్యశాఖ ఎఫ్‌డీవో రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం చీరాల మండలంలోని మత్స్యకార గ్రామాల్లో మత్స్యకార భరోసా లబ్ధిదారుల ఎంపిక సర్వే నిర్వహించారు. వాడరేవు, విజయలక్ష్మీపురం, తీరప్రాంతాల్లో లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. తీరప్రాంతంలో బోటు ఓనర్లు, కళాసీల వివరాలు, ఆధార్, బ్యాంక్ ఖాతా, మత్స్యశాఖ గుర్తింపు కార్డులను పరిశీలించి ఆన్‌లైన్ చేశారు. ఎఫ్‌డీవో మాట్లాడుతూ మత్స్యకారులకు వేట నిషేధంలో ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకంలో ఒక్కో మత్స్యకారుడికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి మత్స్యకారుడికి అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, లబ్ధిదారుల వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తామని చెప్పారు. వీటిలో అభ్యంతరాలు ఉంటే తెలపాలని, అనంతరం తుది జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. తీరప్రాంత గ్రామాల్లో మత్స్యకారులకు మత్స్యకార భరోసా సాయం అందుతుందని ఎఫ్‌డీవో రాజ్‌కుమార్ చెప్పారు.

సివిల్ సర్వీసెస్ డే నిర్వహించుకోవటం సంతోషకరం



బాపట్ల: ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి, వారికి స్ఫూర్తిగా నిలిచేందుకు నేషనల్ సివిల్ సర్వీసెస్ డేను జరుపుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జాతీయ పౌర సేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సభ్యులచే జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్, పౌర సరఫరాల శాఖ అధికారులు విలీమ్స్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

భూరక్ష పథకాన్ని వేగవంతం చేయాలి

పల్నాడు కలెక్టర్ శివశంకర్ లోతేటి




హద్దురాళ్లు వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. మండలంలోని గుంటగార్లపాడు, వల్లప్ప చెరువు ప్రాంతాల్లో జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో చేపట్టిన హద్దురాళ్ల ఏర్పాటును శుక్రవారం ఆయన పరిశీలించారు. చెరువు విస్తీర్ణం కొలతలు తీసిన తీరు, హద్దురాళ్ల వేస్తున్న ప్రాంతం, పనులు జరుగుతున్న తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 70గ్రామాల్లో 1,39,633.58 ఎకరాల్లో హద్దు రాళ్లు ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఇందుకోసం 2,08,386 హద్దు రాళ్లు ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. ఇప్పటికి 1,58,910 హద్దు రాళ్లు ప్రభుత్వం జిల్లాకు అందజేసినట్టు తెలిపారు. అందులో 69,897 హద్దురాళ్లు వేయడం జరిగిందన్నారు. హద్దురాళ్లు ఏర్పాటు పనుల్లో వంద టీంలు పనిచేస్తున్నాయని కలెక్టర్ వివరించారు. ఈ టీంలు 50 కోవర్ల ద్వారా రోజుకు 4,500 హద్దురాళ్లు వేసేందుకు మార్కింగ్ చేస్తున్న ట్టు తెలిపారు. ఒక్కో రోజుకు 3500 హద్దురాళ్లు లక్ష్యం కాగా సుమారు 50 టీమ్‌లు 3400 హద్దు రాళ్లు వేస్తున్నారని తెలిపారు. ఏడు గ్రామాల్లో హద్దురాళ్లు వేసే కార్యక్రమం తుది దశకు చేరుకుందన్నా రు. మిగిలిన 67 గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మరో 25 రోజుల పాటు హద్దురాళ్లు వేసే కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. మే 25 నాటికి హద్దురాళ్లు ఏర్పాటు కార్యక్రమాన్ని తప్పనిసరిగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని రెవెన్యూ అధికారుల ను ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని వంద శాతం నిర్దిష్టగడువులో పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

పకడ్బందీగా టెన్త్ మూల్యాంకనం

- విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ పెంపు
- ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ దేవానందరెడ్డి



టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దేవానందరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియను పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్ల మధ్య పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డి.దేవానందరెడ్డి చెప్పారు. నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టెన్త్ స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని దేవానందరెడ్డి శుక్రవారం సందర్శించారు. స్పాట్ వాల్యూయేషన్ కేంద్రంలో జవాబు పత్రాలకు మూల్యాంకనం జరుగుతున్న తీరును పరిశీలించి, విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం రెమ్యూనరేషన్ పెంచిందని చెప్పారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో పి.శైలజకు సూచించారు. మూల్యాంకనం పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు చల్లటి తాగునీటితోపాటు మహిళా ఉపాధ్యాయినులకు విడిగా మరుగుదొడ్లు నిర్మించడంపై క్యాంపు అధికారి పి.శైలజ, డెప్యూటీ క్యాంపు అధికారి కె.సుధాకర్‌రెడ్డితోపాటు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ వెంకట్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.